క్లుప్తంగా

రేపు జూనియర్ ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 18వతేదీన జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఎంపికకు 1.1.2010 నుంచి 31.12.2011 మధ్య పుట్టిన వారు, బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని కోరారు.

మెరుగైన సేవలు అందించాలి

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ-1 డీపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మదనపల్లె-బెంగళూరు రూట్ కండక్టర్లు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా సర్వీసులు చేయాలన్నారు. ఆదాయం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా లక్ష్మణరావు



మదనపల్లె రూరల్ : మదనపల్లె స్పెషల్ సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా లక్ష్మణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి జిల్లా సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల బదిలీల్లో భాగంగా మదనపల్లెకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణ యాదవ్ తిరుపతి జిల్లా సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సబ్ జైలు నిర్వహణలో సమస్యలు లేకుండా పనిచేస్తామన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ఎప్పుడు ?

పీలేరు : పీలేరులో రెండేళ్ల క్రితం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించినా... యూనిట్ ఏర్పాటు గురించి పట్టించుకోవడం లేదని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగు ఆధారిత రైతులను ఆదుకోవడం లక్ష్యంగా పీలేరులో రూ. 5 కోట్ల వ్యయంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి స్థానిక ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో స్థలం కేటాయించినట్లు తెలిపారు. అయితే స్థలం కేటాయించి రెండేళ్లైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు.

తహసీల్దార్‌గా తేజస్వి



పెద్దమండ్యం: మండల తహసీల్దార్‌గా తేజస్వీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ కడప జిల్లాలోని జీఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తుండగా పెద్దమండ్యం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సయ్యద్ అహ్మద్ విధులు నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

రామసముద్రం తహసీల్దార్‌గా మహమ్మద్ అజారుద్దీన్



రామసముద్రం: మండల తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నిర్మలాదేవి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా వెళ్లడంతో బి.కొత్తకోట తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అజారుద్దీన్ రామసముద్రం తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

తంబళ్లపల్లె తహసీల్దార్‌గా శ్రీనివాసులు



తంబళ్లపల్లె: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గుర్రంకొండలో పని చేస్తూ బదిలీపై వచ్చారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల పరిశీలన

రామసముద్రం: ప్రతి గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ఈవోపీఆర్‌డి గఫూర్ తెలిపారు. సోమవారం రామసముద్రంలోని ఎస్‌ఈ డబ్ల్యూపీసీ షెడ్లను పంచాయతీ కార్యదర్శితో కలసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాడైన షెడ్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

అబద్ధాలతో అరాచక పాలన

- కూటమి ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం
- సూపర్ సిక్స్...సూపర్ ఎలెవన్ ఏమయ్యాయి ?
- ఏడాదిగా ప్రజలను మాయమాటలతో వంచిస్తున్న ఎమ్మెల్యే
- జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ



జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిసార్‌అహ్మద్ మనూజారెడ్డి, షమీంఅస్లాం తదితరులు



కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తదితరులు

మదనపల్లె రూరల్ : కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మండిపడ్డారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కూటమి ఏడాది పాలనలో మోసాలపై..జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పేరుతో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...ఎలాగైనా అధికారంలోకి రావాలని నోటికొచ్చిన అబద్ధపు హామీలను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గుప్పించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఒక్క హామీని కూడా అమలుచేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.2.80లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అమ్మ ఒడి పథకం కింద రాష్ట్రంలో ఎంతమంది లబ్దిదారులు ఉంటే అంతమంది తల్లుల ఖాతాల్లోకి రూ.15వేలు జగనన్న జమచేస్తే...తల్లికి వందనం అంటూ చంద్రబాబు, 30లక్షల మంది తల్లుల ఖాతాల్లో డబ్బులు వేయకుండా ఎగనామం పెట్టారన్నారు. ఏడాదికాలంలో మోసాలు, అబద్ధాలు, అరాచకాలతో పాలన సాగించారే కానీ, రాష్ట్రప్రజలకు చేసింది ఏమీలేదని మండిపడ్డారు. ఇక మదనపల్లె నియోజకవర్గం విషయానికొస్తే...సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ అంటే... స్థానిక ఎమ్మెల్యే సూపర్ ఎలెవన్ (మదనపల్లె మేనిఫెస్టో-2024) అంటూ ఏడాదికాలంగా ప్రజలను మోసగిస్తూనే ఉన్నారన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చేందుకు ఎమ్మెల్యేకు ఏడాది సమయం ఇచ్చామని, అయితే ఆయన పట్టించుకోకపోగా, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుంటే...నిలదీసేందుకు సిద్ధమయ్యామన్నారు.

జిల్లా కేంద్రం చేస్తామన్నది ఒట్టిమాటేనా?

ఎన్నికలప్పుడు కూటమినాయకులు రాయచోటిలో జిల్లా కేంద్రం కొనసాగిస్తామని, రాజంపేట, మదనపల్లెను జిల్లా కేంద్రాలుగా చేస్తామని, ఏ ప్రాంతానికి ఆ మాట చెప్పి ప్రజలను మోసగించి ఓట్లేయించుకున్నారన్నారు. అయితే ఇప్పటివరకు జిల్లా చేయడంపై ఎలాంటి చలనం లేదన్నారు. బీటీ కళాశాలను యూనివర్శిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఎంపీ మిథున్‌రెడ్డి జీఓ తెస్తే, విమర్శించారని, ఏడాదికాలంగా కూటమిప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదన్నారు.

మెడికల్ కాలేజీ పనులు ఆపేశారు :

ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ 11 మెడికల్ కాలేజీలు ఉంటే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరుచేసిందన్నారు. రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మదనపల్లెలో మెడికల్ కాలేజీ ఏర్పాటుచేసి, స్థానిక విద్యార్థులకు వైద్యవిద్యను అభ్యసించే అవకాశంతో పాటు పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటే, కూటమిప్రభుత్వం పనులు నిలిపివేసిందన్నారు.

జిల్లా ఆస్పత్రిపై పూర్తిగా నిర్లక్ష్యం :

టీడీపీ ప్రభుత్వంలో జిల్లా ఆస్పత్రిని పూర్తిగా నిర్వీర్యం చేసి, ప్రతి కేసు రెఫర్ చేయడమే కాకుండా, చిన్నపాటి మందులు అందుబాటులో లేని దుస్థితికి తెచ్చారన్నారు. పేదపిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు, మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరుచేయించి, రూ.50లక్షలతో తాత్కాలిక భవనాలను నిర్మించి, వలసపల్లెలో స్థలం కేటాయిస్తే...కబ్జా చేస్తున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బలిజ కులస్థులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 1.50 ఎకరాల స్థలం కేటాయిస్తే...పట్టించుకోకుండా వదిలేశారన్నారు.

ట్రాఫిక్ సమస్య తీర్చేదెప్పుడు?

మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఉందన్నారు. సీటీఎం రోడ్డులో చెట్లు నరికివేసి, ఆక్రమణలు తొలగించకపోగా, ఉన్న కొద్దిపాటి రోడ్డును గోతులమయంగా మార్చేశారన్నారు. తహసీల్దార్, కోర్టుప్రాంగణాల్లో పబ్లిక్‌టాయిలెట్స్ ఏర్పాటుచేసి స్త్రీల ఇబ్బందులు తీర్చాలన్నారు. మదనపల్లె-నిమ్మనపల్లె, మదనపల్లె-రామసముద్రం డబుల్‌రోడ్డు పనులు తక్షణమే చేపట్టాలన్నారు. ఇందిరానగర్‌లోని షాదీమహల్‌ను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేతన్ననేస్తంతో వెలుగువెలిగిన నేతన్నలు నేడు వ్యాపారాలు లేక చితికిపోయారని, ఆదుకునేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

టమాటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు అంతేనా?

మదనపల్లె నియోజకవర్గంలో అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో టమాటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుచేస్తామని చెప్పిన మంత్రి నారాలోకేష్ హామీ నిలుపుకోవాలన్నారు. తోపుడుబండ్లకు గేటు మినహాయింపు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ..జగనన్న ఐదేళ్లలో సంక్షేమపథకాలు, అభివృద్ధి కోసం చేసిన అప్పులకన్నా...చంద్రబాబు ఏడాదికే అంతకుమించి అప్పులుచేశారని, అయితే వాటిని ఏ పథకాలకు ఖర్చుచేశారో అర్థం కావడం లేదన్నారు. కూటమినాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా,ప్రసాద్‌బాబు, ఎంపీటీసీ నీరుగట్టిమేరీ, కోఆప్షన్ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పీఎస్.రెడ్డి, మయూరిరఘునాథరెడ్డి, రామిశెట్టి మధు, కొత్తపల్లె మహేష్, వినుతాభాయి, అపర్ణ, జయంతి, నూర్‌మొహియుద్దీన్‌ఖాన్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సంక్షేమం నిల్

కలికిరి(వాల్మీకిపురం): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అక్రమాలు, కేసులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు తప్ప సంక్షేమం పూర్తిగా కనుమరుగైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదటి ఏడాదిలోనే ఇచ్చిన నవరత్నాలు పథకాలను పూర్తి స్థాయిలో హామీలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. 2024 ఎన్నికలలో అమలుకు వీలులేని లేనిపోని హామీలను గుప్పించిన కూటమి నేతలు గద్దెనెక్కి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారన్నారు. రైతాంగం నుంచి మహిళలు, విద్యార్థులు, యువత ప్రతి ఒక్కరు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఏక వర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని కూటమి ప్రభుత్వం అసహనం వ్యక్తం చేశారు. పైగా సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేశామని, ఇకపై సూపర్ సిక్స్ పేరెత్తకూడదని సీఎం చంద్రబాబు అనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

పరామర్శ

మండలంలోని వాల్మీకిపురం పంచాయతీ జర్రావారిపల్లికి చెందిన పంచాయతీ రాజ్‌శాఖ విశ్రాంత ఉద్యోగి రామక్రిష్ణ అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారంతో వారి ఇంటికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆయనను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే జర్రావారిపల్లిలో గ్రామదేవత నల్లవీర గంగాభవాని జాతర సందర్భంగా జర్రావారిపల్లిలో సర్పంచ్ మునిభాస్కర్, వడ్డిపల్లిలో మండల సోషల్ మీడియా అధ్యక్షుడు రాజబాబు ఇచ్చిన విందుకు హాజరయ్యారు. అనంతరం మల్లిరెడ్డిగారిపల్లికి చెందిన సిద్దారెడ్డి మరణించిన సమాచారంతో వారి ఇంటికెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో ఏపీఎండీసీ మాజీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పులిశివకుమార్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాజేష్, నాయకులు విఠలం సురేష్‌రెడ్డి, గంగిరెడ్డి, చలపతి, నాగరాజ, సుబ్రమణ్యం, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులు బాధ్యతల స్వీకరణ

మదనపల్లె రూరల్ : మండల వ్యవసాయాధికారిగా నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ నాగప్రసాద్..వాల్మీకిపురం డివిజనల్‌లో ఏడీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డిని మదనపల్లె మండల వ్యవసాయాధికారిగా బదిలీ చేశారు. మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

వాల్మీకిపురం ఏఓగా మురళీమోహన్

కలికిరి(వాల్మీకిపురం): మండల వ్యవసాయాధికారిగా యు.మురళీమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బి.కొత్తకోట మండలం నుంచి వాల్మీకిపురంకు బదిలీ అయిన ఆయన విధులలో చేరారు. వాల్మీకిపురం మండల వ్యవసాయాధికారి ఎం.హేమలత కలికిరి మండలానికి బదిలీ అయ్యారు. సోమవారం ఆమె కలికిరి మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

నిమ్మనపల్లె ఏఓగా మంజుల

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండల వ్యవసాయ అధికారిగా ఎస్. మంజుల సోమవారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న మంజుల ఇటీవల బదిలీలలో భాగంగా నిమ్మనపల్లెకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మురళీమోహన్ వాల్మీకిపురం మండల వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యారు.

కేవీపల్లె వ్యవసాయాధికారిగా మాధవి

కేవీపల్లె : కేవీపల్లె మండల వ్యవసాయాధికారిగా మాధవి బాధ్యతలు స్వీకరించారు. కేవీపల్లె ఏవోగా యు. శ్రావణి బదిలీపై రొంపిచెర్లకు వెళ్లారు. సదుం ఏవోగా పని చేస్తున్న మాధవి బదిలీపై కేవీపల్లెకు వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఇక్కడ పని చేస్తున్న ఏఈవో ఇంద్ర కలికిరికి బదిలీ కావడంతో పీలేరు నుంచి బదిలీ అయిన ఏఈవో జ్యోత్స్న కేవీపల్లె ఏఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బదిలీ అయిన ఏవో శ్రావణి, ఏఈవో ఇంద్రలను ఘనంగా సన్మానించారు.

కలకడ ఏఓగా యం.ఆర్.శ్రీనివాస్

కలకడ : మండల వ్యవశాయశాఖ అధికారిగా యం ఆర్ శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

సర్వేయర్‌గా నరేంద్రబాబు

రామసముద్రం: మండల సర్వేయర్‌గా నరేంద్రబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నాగరాజు సాధారణ బదిలీల్లో భాగంగా తంబళ్లపల్లి సర్వేయర్‌గా వెళ్లారు. అక్కడ పని చేసిన నరేంద్రబాబు ఇక్కడికి వచ్చారు. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని నరేంద్రబాబు తెలిపారు.

ప్రజా సమస్యలపై అర్జీల వెల్లువ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన ప్రజలు...సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై అర్జీలు సమర్పించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కారం దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. బసినికొండ పంచాయతీ తట్టివారిపల్లె గ్రామంలో 2007లో కొనుగోలు చేసిన భూమిలోకి కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి ఇబ్బందులు కలగజేస్తున్నారని, సర్వే చేసేందుకు అధికారులను రానివ్వడం లేదని గుర్రంకొండ మండలం టి.రాచపల్లెకు చెందిన పి.నరసింహారెడ్డి ఫిర్యాదుచేశారు. వాల్మీకిపురం జర్రావారిపల్లెకు చెందిన సయ్యద్‌బాషా...తమ భూములకు సంబంధించిన పాసుపుస్తకాలలో తనపేరు, తండ్రిపేరును తప్పుగా నమోదుచేశారని, సవరణ చేయాల్సిందిగా కోరుతూ అర్జీ సమర్పించారు. పెద్దమండ్యం మండలం కలిచెర్ల నాగూరివారిపల్లెకు చెందిన ఈశ్వరమ్మ...భూములకు సంబంధించి బావ పాపిరెడ్డికి, తమకు భాగపరిష్కారాలు కానందున ఖాతానెంబర్.2444, 2445ను ఆన్‌లైన్‌లో హోల్డ్‌లో పెట్టాల్సిందిగా వినతిచేశారు. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ సర్వేనెంబర్.1072లో ప్రభుత్వం నుంచి న్యాయపరమైన అన్ని అనుమతులు పొంది క్వారీ నిర్వహించుకుంటుండగా, కొందరు వ్యక్తులు తప్పుడు ఆరోపణలతో, అనుమతి లేకుండా ప్రవేశించి ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ గాయత్రి అగ్రిగేట్స్ తరపున జబ్బల శ్రీనివాసులు ఫిర్యాదుచేశారు.

అతిసార నివారణపై అవగాహన



అతిసారపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

నిమ్మనపల్లె : స్టాప్ డయేరియా(అతిసార), చేతుల పరిశుభ్రతపై డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహమ్మద్ రఫీ అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని కొండయ్య గారి పల్లె పంచాయతీ కొమ్మి రెడ్డి గారి పల్లెలో 104 సేవలలో భాగంగా, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్టాప్ డయేరియాపై అవగాహన చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అతి సార నివారణకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని రోడ్డుపై విక్రయించే పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలలో అతిసార వ్యాప్తి చెందకుండా మరణాలు తగ్గించేందుకు, ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా పై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారీ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి ఏఎన్ఎం చెన్నమ్మ అంగన్వాడీ కార్యకర్త రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : చిన్నపిల్లలకు వచ్చే డయేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని తలపుల పీహెచ్‌సీ ఏఎన్ఎం రేణుక అన్నారు. సోమవారం పీలేరులో డయేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయారియా కారణంగా పిల్లల శరీరంలో కోల్పోయిన నీటిని, ఖనిజ లవణాలను తిరిగి నింపడానికి ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పన కోసం జాబ్‌మేళా



మాట్లాడుతున్న శ్రీజ డెయిరీ మేనేజర్ రవికుమార్

తంబళ్లపల్లె: నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్‌హబ్‌ల ద్వారా జాబ్‌మేళా నిర్వహిస్తున్ననట్లు శ్రీజా డెయిరీ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక టీఎన్ వెంటకసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్ అండ్ టీ కంపెనీ, అమరరాజ, ముషాషి ఆటో పార్ట్స్ కంపెనీ, మల్టీటెక్ (బెంగుళూరు), యజాకీ ఇండియా, శ్రీజ డెయిరీ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఐటీఐలో శిక్షణ పొందిన 75 మంది జాబ్‌మేళాకు హాజరయ్యారు. వారిలో 65 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, స్కిల్‌హబ్ డైరెక్టర్ చౌడయ్య తెలిపారు. ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాలను అనుగుణంగా జీతం కల్పించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీఐ టీఓలు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికుల ధర్నా

మదనపల్లె: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్షల్లో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లను తీర్చాలంటూ నినాదాలు చేశారు. 13రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, సాంకేతిక సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి 24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆప్కాస్ పరిధిలోని నాన్ పీహెచ్ కార్మికులను ఇంజినీరింగ్ విభాగ కార్మికులుగా నమోదు చేయాలని, తమ డిమాండ్లు తీర్చాలంటూ కార్మికులు నినాదాలు చేశారు. దీక్షల్లో ఎస్‌కే.రెడ్డెప్ప, ఎస్.నాగరాజు, ఎంఎస్.కన్నయ్య, గోపాలకృష్ణ, సజాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు మొదటి రోజు నిరసన సెగ

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులకు మొదటి రోజే సీపీఐ రైతు సంఘం నాయకుల నుంచి నిరసన సెగ తగిలింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ రైతు సంఘం నాయకులు అంజనప్ప ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన గతంలో ములకలచెరువు తహసీల్దార్‌గా పని చేసినప్పుడు గుడుపల్లి గ్రామం చెన్నప్పగారిపల్లె గడ్డ శోత్రియం భూములను పక్క జిల్లాలోని భూస్వాములకు రికార్డులు చేసి పేదలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తంబయ్యశెట్టి, సుబ్బన్న, రమణప్ప, నిజాముద్దీన్, నరసింహులు, లక్ష్మిదేవి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

'బీసీ ఆత్మగౌరవ భరోసా'ను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పీలేరు రూరల్ : ఈ నెల 22న తిరుపతి ఇందిరా మైదానంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే బీసీ ఆత్మగౌరవ భరోసా కార్యక్రమం జయప్రదం చేయాలని మాజీ మంత్రి పరసారత్నం, బీసీ కన్వీనర్ ఆల్‌మెన్‌రాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో బీసీ ఆత్మ గౌరవ భరోసా కార్యక్రమం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలనందరినీ ఐక్యమత్యం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. బీసీ నాయకులు నాగరాజ, మురళీ, యాదగిరి, రఘునాథ, వేణుగోపాల్, రామస్వామి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలానికి వీడిన చెర

- దురాక్రమణ స్థలం స్వాధీనం
- హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

కురబలకోట: మండలంలోని ఓంటిళ్ల దగ్గర దురాక్రణలోని హైవే స్థలాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు హుటాహుటిన వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. ఎవ్వరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. సాక్షి దినపత్రికలో అడిగేదెవరు..ఆపేదెవరు..దర్జాగా హైవే స్థలం ఆక్రమణ అనే కథనం సోమవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆఘమేఘాలపై మండల సర్వేయర్ భువనేశ్వరి, ఆర్ఐ శేషాద్రి రావు, వీఆర్వో ప్రతిమ ఆక్రమణ స్థలం వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. హైవే స్థలం ఆక్రమణకు గురైనట్లు వెల్లడైంది. దాంతో పాటు దీనిని ఆనుకునే సర్వే నెంబర్లు 477,461లో కూడా పొరంబోకు భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. దీంతో హైవే స్థలంతో పాటు ఈ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తహసీల్దారు ధనుంజయులు తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

బందెలదొడ్డిపై ముందుకు సాగని చర్యలు

మదనపల్లె: మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన స్థానిక మిషన్‌కాంపౌండ్ ఎదురుగా ఉన్న బందెలదొడ్డి భూమిలో ప్రైవేటు వ్యక్తులు చకచకా పనులు చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సోమవారం భూమిలోకి మట్టి తరలించుకుని చదును పనులు చేస్తున్నారు. పట్టణ ప్రజలు అది మున్సిపాలిటీకి చెందిన బందెలదొడ్డి భూమని స్పష్టం చేస్తుంటే అధికారులు విచారణ, సర్వే పేరుతో జాప్యం చేస్తున్నట్టు అర్థమవుతోంది. రూ.కోట్ల విలువచేసే భూమిని కాపాడుకునే విషయంలో మున్సిపల్ అధికారులు ఒత్తిళ్ల కారణంగా ముందుకు వెళ్లడం లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొదట బందెలదొడ్డి భూమి పుట్టుక వివరాలను పరిశీలించి..తర్వాత ఆ భూమిలో లేదా సర్వేనంబర్‌లో ఎంత విస్తీర్ణం ఉంది, అందులో ప్రయివేటు వ్యక్తులకు హక్కులు ఉన్నాయా, ఉంటే అవి ఎలా సంక్రమించాయి, ఎవరి నుంచి సంక్రమించాయి అన్న వివరాలతో చర్యలు తీసుకోవాల్సింది. ఒకవేళ విచారణ లేదా చర్యలు తీసుకోవడానికి ఒత్తిళ్లు ఉంటే బందెలదొడ్డి భూమిలో ప్రయివేటు వ్యక్తులు పనులు చేపట్టకుండా నిలిపివేయించాల్సిన బాధ్యత అధికారులది. వాస్తవంగా భూమి ఎవరిదో, ఎవరికి ఎంత భూమి ఉందో తేలాక తదుపరి చర్యలు తీసుకునే వీలుంటుంది. అలా కాకుండా అధికారులు ప్రాథమికంగా పనులు జరగకుండా అడ్డుకోవడంలో విఫలం అయ్యారు. ఇలాగే కొనసాగితే పక్కా నిర్మాణాలు చేపట్టి అధికారులు అందులోకి వెళ్లలేని పరిస్థితులు వస్తాయి. కాగా ఈ భూమికి సంబంధిన న్యాయస్థానం కేసులు, రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్నామని కమిషనర్ ప్రమీల వారం క్రితమే చెప్పారు. అయితే అసలు ఈ బందెలదొడ్డి భూమికి సంబంధించి మున్సిపల్ రికార్డులు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రాష్ట్ర అధికారుల సర్వే ఆధారంగా ప్రచురితమైన మదనపల్లె మున్సిపల్ ఆస్తుల వివరాల నివేదికను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ వివరాల జోలికి వెళ్లకుండా ప్రయివేటు వ్యక్తులు ఇచ్చిన రికార్డులతో విచారణ సాగిస్తే అది పూర్తిగా వారికి సహకరించినట్టుగానే ఉంటుంది. ఏదిఏమైనా మున్సిపల్ అధికారులు మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తెరుచుకోని గ్రామ సచివాలయాలు



తెరచుకోని సంగసముద్రం గ్రామ సచివాలయం

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు తెరుచుకోలేదు. సమయం మించిపోయినా తాళాలు తీసేవారే కరువయారు. అధికారులు సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియక ప్రజలు పడిగాపులు పడ్డారు. సోమవారం గ్రీవెన్స్ డే కావడంతో ప్రజలు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున సచివాలయాల వద్దకు చేరుకొన్నారు. ఉదయం 10 గంటలకే అధికారుల కోసం సచివాలయాల వద్దకు చేరుకొని నిరీక్షించ సాగారు. అయితే అధికారులు ఎవ్వరూ సచివాలయాల వద్దకు చేరుకోలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు సచివాలయాలు ఉదయం 10 గంటలకు తెరవాల్సి ఉంది. 10.30 గంటలు లోగా సచివాలయ అధికారులు సచివాలయం చేరుకొని రిజిష్టర్‌లో సంతకాలు చేసి ఆన్‌లైన్‌లో వేలిముద్రలు వేయాలి. అయితే పలు గ్రామాల్లో 10.30 దాటినా సచివాలయాలు తెరుచుకోక పోవడం గమనార్హాం. 10.45 గంటల తరువాత ఒకరిద్దరు సచివాలయ ఉద్యోగులు హడావిడిగా వచ్చి సచివాలయాలను తెరిచారు. కొంతమంది 10.45 గంటలు దాటినా 11 గంటల సమయం వరకు సచివాలయాలకు రాకపోవడం గమనార్హాం. ఈవిషయమై ఎంపీడీఓ వెంకటేశులును వివరణ కోరగా ఈరోజు కలెక్టర్ గారి వీసీ ఉండడంతో సచివాలయ ఉద్యోగులందర్ని గుర్రంకొండలోని మండల పరిషత్ కార్యాలయంకు రావాల్సిందిగా చెప్పామన్నారు.